

# అనుభవం

## యర్రమిల్లి విజయలక్ష్మి

**పౌరుగూర్లో ఉద్యోగం చేసుకుంటున్న కొడుకు, కోడలు ఉదయం ప్యాసింజర్ బండి దిగి వచ్చే సమయానికి మహేశ్వరమ్మ గడ్డీ గాదం, చెత్తా చెదారం ఎత్తిపోసి, పెరడు శుభ్రం చేసే పనిలో వుంది. ఏ రంగో గుర్తు తెలియనంతగా వెలిసిపోయి, చిరుగులకు వేసిన కందికాయ కుట్లు కూడా పిగిలిపోయిన పాత చీర. అట్లాంటిదే మూడు రంగులు తేలి గుండెల దగ్గర బొత్తలూడి బలహీనంగా వున్న గుండెల్ని దాచలేకపోతున్న రవిక. ముగ్గుబుట్టలా చింపిరి చింపిరిగా వున్న తల, దుర్బలంగా వున్న వయసు మీదపడిన పల్చని శరీరం..**

ఆ సమయంలో ఆవిడ్ని ఏ కూలిమనిషో, పనిమనిషో అనుకుంటారు తప్ప ఇంటి యజమానురాలని కొత్తవాళ్ళెవరూ అనుకోరు. మొక్కల మొదళ్ళలో రాలిన ఎండు ఆకుల్ని చేతుల్తో ఏరుతూ దీక్షగా పనిచేసుకుంటున్న తల్లి దగ్గరకు వచ్చి ''ఏమిటమ్మా... ఎందుకింత శ్రమపడతావు. పెరడు శుభ్రం చెయ్యటానికెవరన్నా మనిషిని పెట్టుకోవచ్చుగా'' అన్నాడు అబ్బాయి. తల్లినా పరిస్థితిలో చూడటం అతనికి చాలా అసహనాన్ని కలిగిస్తోంది. ''మనిషినా.. ఊరెల్లా తయారైందంటావు. మనిషి దొరకటమే! చుట్టుపక్కలన్నీ ఫ్యాక్టరీలు, అట్టల ఫ్యాక్టరీ.. పొలంపనులు.. రోజుకి 50, 60 రూపాయలు చులాగ్గా సంపాదించుకుంటారు ఇళ్ళల్లో పనికెవరొస్తున్నారు. వచ్చినా డబ్బులు తీసుకుపోవటం తప్ప పనిచేస్తారా? లోపలికి పద.. ఈ కాస్త చేసుకువస్తా'' అమ్మ చెప్పింది కొడుక్కేమీ సంతృప్తి కలిగించలేదు. అలా అని ఏమనాలో అర్థం కాలేదు. 'అమ్మెప్పుడూ ఇంతే. సుఖపడటం చేత కాదు. ఇంట్లోపడి కూలి మనిషిలా చాకిరీ చేస్తుంది. ఎందుకో ఈవిడికి ఇల్లంటే ఇంత వ్యామోహం. శుభ్రంగా ఎవరికన్నా అద్దెకిచ్చేసి తన దగ్గరికి వచ్చి వుండచ్చుగా.. ఊహు.. చెప్పి, చెప్పి విసుగొచ్చింది. ఆవిడ పద్ధతి ఆవిడది కాని ఒకరి మాట పట్టిచ్చుకోదు. లంకంత పూర్వకాలం కొంప. వసతులు లేవు. ఒక మూల్నించి శిథిలమైపోతోంది. ఆవిడెలా వుంటోందోకాని ఎవరూ పది రోజులుండలేరు. ఆవిడ మాత్రం ఒకరోజు ఇల్లు వదిలి వెళ్ళదు. ఇంటికి తాళం వెయ్యటానికి ససేమిరా ఒప్పదు. పోనీ అవసరమైన బాగులన్నా చేయించుకుని కావలసిన సౌకర్యాలేర్పరుచుకుని సుఖంగానన్నా వుంటుందాంటే అదీ చెయ్యదు. లోలోపల విసుక్కుంటూ పేపరు చూస్తూ కూర్చున్నాడు. కోడలు అత్తగారికి కాస్త సాయం చెయ్యాలని ప్రయత్నిస్తోంది. ఆవిడకి అత్తగారంటే కొంత భయం గౌరవం కూడా. ఆవిడకేమీ తను సలహా ఇయ్యలేదు. అయినా ఈ వయసులో పాపం ఈవిడకెందుకింత ఇబ్బంది పడటం అనుకుంది. ఒకవేళ ధైర్యం చేసి ఏమన్నా చెప్పినా ఆవిడ వినదు. కన్నపిల్లలే ఆవిడకి చెప్పలేరు. మామగారి పెన్షన్ రెండు వేలు వస్తుంది. వుండటానికి ఇల్లుంది. దాన్ని కాస్త బాగుచేయించి ఒక వాటా అద్దెకిచ్చుకోవచ్చు. పక్కన కాస్త తోడూ వుంటారు. నెలకింతని అద్దె వస్తుంది. అంత ఇంట్లో ఒక్కతే బిక్కుబిక్కుమంటూ వుంటుంది. వచ్చినప్పుడల్లా చెప్తారాయన. ఒకళ్ళ మాట వినే రకం కాదు. దగ్గరలో వుండబట్టి రాగలుగుతున్నాం. దూరంలో వున్న మరుదులు

తోటికోడళ్ళు ఏడాదికోసారి మావగారి ఆబ్దికాని కన్నా రాలేకపోతున్నారు.. ఇదంతా కోడలు పిల్ల స్వగతమే పైకేమీ కనపడదు.

''అమ్మా! డబ్బేమన్నా కావాలా?'' బయల్దేరుతూ అడిగాడు కొడుకు.

మహేశ్వరమ్మ నవ్వింది. ''నాకెందుకురా నీ డబ్బు.. మీ నాన్న పెన్షన్ వస్తుందిగా. నేనెవరి దగ్గర్నించీ తీసుకోను. మీ ఖర్చులు అవసరాలు మీకుంటాయి''

'మీ నాన్న పెన్షన్' అన్నప్పుడు ఆవిడ కళ్ళు మెరుస్తాయి. పాలిపోయి ముడతలు తేలిన ముఖంలో గర్వం కనిపిస్తుంది. భర్త తదనంతరం ఆవిడ అందుకుంటున్న పెన్షన్ ఆయనెక్కడో గుమస్తాగిరి చేసి సంపాదించి కాదు. స్వాతంత్ర్య సమర యోధులకి భారతప్రభుత్వం సగౌరవంగా ఇస్తున్న జీవన భృతి. ఆవిడ భర్త నరసింహంగారు చదువు మధ్యలో మానేసి ఉద్యమంలో చేరి పోయాడు. మూడుసార్లు మొత్తంమీద పద్దెనిమిది నెలలు జైలు శిక్ష అనుభవించాడు. స్వాతంత్ర్యం వచ్చాక దేశానికి వాళ్ళ అవసరం లేకపోయింది. స్వాతంత్ర్యం తెచ్చిపెట్టటం వరకే.. స్వేచ్ఛా భారతాన్ని పరిపాలించే అర్హత వాళ్ళకి దక్కలేదు. అయినా ఏదో తగిన పని చేసి సంసారాన్ని గెంటుకొచ్చాడాయన. ఆయన వెళ్ళిపోయాక ఆ త్యాగఫలం కొంత ఆవిడ అనుభవించగలుగుతోంది. అందుకే ఆవిడకి తన పెన్షనంటే అంత గొప్ప. లక్ష రూపాయలు తీసుకుంటున్నంత అభిజాత్యంతో ఒక వెయ్యిరూపాయలు నెల నెల తీసుకుంటుంది. 'వచ్చేదే రెండువేలు.. అందులో ఇంకా దాచటం ఎందుకు. సుఖంగా ఖర్చుపెట్టుకోరాదూ. వెయ్యిరూపాయలంటే ఏం సరిపోతాయి' అంటారు పిల్లలు. 'వెయ్యిరూపాయలు చాలవా. మీరంటే లక్షాధికారులు. సంపాదించుకుంటున్నారు. నాకిదే ఆధారం. వెయ్యిరూపాయలు వాడుకోవటానికే నాకు అర్హత వుంది' అంటుంది. ఆవిడ ఆలోచనా ధోరణి ఎవరికీ అర్థం కాదు. 'ముసల్దానికి డబ్బు మీద యావెక్కువ. దాచిపెట్టుకుంటోంది. సరిగ్గా తినదు. మంచి గుడ్డ కట్టదు' అని విసుక్కుంటారు పిల్లలు.

మహా అభిమాని.. అహంకారమూ ఎక్కువనిపిస్తుంది. ఎవరిమీద, ఏ విషయంలోనూ ఆధారపడటం నచ్చదు. చివరికి పిల్లల దగ్గరైనా పదిరూపాయలు తీసుకోదు. ఏ పనికీ ఇతరుల నాశ్రయించటం ఆవిడ జీవితంలో లేదు. అందుకు తగ్గ పట్టుదల, క్రమశిక్షణ, మనఃశక్తి ఆవిడకబ్బాయి. ముక్కుసూటి మనిషి. మంచి ఆస్తికురాలు. ఆవిడ జీవితంలో రెండింటికే విలువిస్తుంది. ఒకటి తన ఇల్లు, రెండోది గుడి. నరసింహంగారు పోయిన కొత్తల్లో ఆవిడ, కొన్ని సంవత్సరాలు దుఃఖావేశంలో మూగపోయింది. నిద్రాహారాలు మాని అదే దిగులుతో జీవచ్ఛవంలా గడిపింది. ఆ దుఃఖంలోంచి ఏ మహానుభావుడి వల్లనో ఆవిడలో ఆధ్యాత్మిక వికాసం మొదలైంది. పూర్వదశకు విరుద్ధంగా ఆవిడ జీవిత విధానం మారిపోయింది. నిరంతర దైవ చింతనుండి ఒక సన్యాసిని అన్నట్టు తన జీవితాన్ని మార్చేసుకుంది. ఇప్పుడావిడ జీవితంలో ఆత్మసముద్ధరణ ప్రయత్నమే తప్ప ఇంకోటి లేదు. విషయాసక్తి లేదు. ఎవరిమీద మమకారం లేదు. కేవలం తనకోసం తను బ్రతుకుతున్నట్లుంటుంది. అయితే ఇదంతా బయటకు కనపడదు. ప్రవర్తన, మాట, జీవన విధానం చూసే వారికి భిన్నంగా తోస్తాయి. అర్థం చేసుకున్న వాళ్ళు చాలా అభిమానించి గౌరవిస్తారు. వీళ్ళుచాలా తక్కువ. తెలుసుకోలేక ఆవిడ విధానాన్ని విమర్శించుకునే వాళ్ళు ఎక్కువ. వీళ్లలో ఆవిడ సంతానాన్ని కూడా చేర్చొచ్చు. ఆవిడ ధాటికి భయం వల్లో, పెద్దదన్న గౌరవం వల్లో మాట్లాడరు తప్ప వాళ్ళెవరూ మనస్ఫూర్తిగా ఆమోదించలేరు. లోకంలో తల్లిదండ్రులెవరైనా సాధారణంగా వయసు పైబడ్డాక అన్నీ అప్పగించి పిల్లల పంచన చేరి వాళ్ళ నీడలో శేషజీవితాన్ని వెళ్ళమార్చుకుంటారు. ఈవిడ డెబ్బై ఏళ్ళు పైబడినా 'నా బతుకు నేనే బతగ్గలను. మీ సాయం నాకేం అక్కర్లేదు' అని తెగేసి మొండిగా వుంటోంది. చివరికి వాళ్ళే ఆమె దారికి వచ్చారు. వీలున్నప్పుడు వాళ్ళే వచ్చి చూసి పోతారు. వస్తే మంచిది.. రాకపోయినా మంచిదే.. ఆవిడ కదేం పట్టదు. భర్తమూలంగా అనుభవించిన తీవ్రమైన దుఃఖం విరక్తిని పెంచి మమకారాలను మాయం చేసింది. లోకధర్మంగా కొన్ని బంధాలు పాటిస్తుందంతే. ఏదీ మనసుకి అంటదు. మూడు వందల అరవై రోజులూ పర్వదినాలే. అన్ని పండుగలూ శ్రద్ధగా నిష్ఠతో జరుపుతుంది. సర్వ దేవీ, దేవతలకు పూజలు చేస్తుంది. ఏ పండగ వచ్చినా తెల్లవారకుండానే ఆ దేవుడి గుడికి బయల్దేరుతుంది. తలార స్నానం చేసి, స్వయంగా ఉతికి ఆరేసుకున్న నేత జరీచీర కట్టి, పండో ఫలమో పెరట్లో పూసిన మందార పూలో దేవుడి బుట్టలో వేసుకుని రొంటిన రెండు పావలా బిళ్ళలు కట్టుకుని ఆకాశంలో ఇంకా వెలుగు కనపడక ముందు నడుచుకుంటూ పోతుంది. ఆరోజు ప్రథమ పూజ. అభిషేకమో, అర్చనో నమస్కారమో ఆ దేవుడికి ఆవిడదే. ఇంకోళ్ళ కెవరికీ ఆ అవకాశం రాదు. ఎంత రద్దీగా వున్నా ఎంత క్యూ వున్నా చకచక గర్భాలయంలోకి దూసుకుపోయే ఆవిడ్ని ఆపగల సాహసం కార్యకర్తలకి గాని, వాలంటీర్లకు గాని, అర్చకులకు గాని వుండదు. పైగా 'రండి. బామ్మగారూ రండి రండి' అంటూ వెంటనే ప్రత్యేక దర్శనం, పూజ చేయించి మరీ పంపుతారు. ఎవరన్నా అజ్ఞానులు అటకాయించినా ''యాభై ఏళ్ళ మట్టి ఈ ఊళ్ళో ఉంటున్నాను. ఈ గుడి కట్టటం నాకు తెలుసు. నాకు క్యూ ఏమిటి? అని ఒక్క విసురు దబాయించి నోరు మూయిస్తుంది. మళ్ళీ వేగంగా అంతదూరం నడుచుకుంటూ తిరిగి వచ్చి తన నిష్టానుష్టానంలో పడుతుంది. ఆ వయసులో కూడా ఆవిడలో ప్రకటితమౌతున్న చైతన్యం, దీక్ష, కఠిన నియమం చూసే వాళ్ళకు విస్మయాన్ని కలిగిస్తుంది. ఆవిడ ఒక నిరంతర సమరశీలిలా తోస్తుంది.

''కేశవస్వామి గుడి ఇక్కడుందా.. మూడు మైళ్ళు



## యాక్సిడెంట్

**టీ**వి స్టార్ శ్వేతా అగర్వాల్ ఈమధ్య ప్రమాదానికి గురైంది. కాలికి దెబ్బతగిలి షూటింగ్ కాన్సిలయింది. అయినా రోజుల తరబడి రెస్ట్ తీసుకోకుండా తిరిగి షూటింగ్‌లో పాల్గొంది. 'దేఖో మగర్ ప్యార్ సే' సీరియల్ నుంచి తనను తొలగించినప్పటి నుంచి చాలా రిలీఫ్‌గా వుందట! ''ఆ టీమ్‌లో డిసిప్లిన్ లేదు. రోజుల తరబడి రెస్ట్ లేకుండా షూటింగ్ చేయాలంటారు. నిద్రలేకుండా యాక్ట్ చేస్తే ఫీలింగ్స్ ఎలా పలుకుతాయి. ఇంతా చేసి నన్ను తీసేస్తున్నట్టు లైట్‌బాయ్‌తో కబురు పంపారు'' అని మండిపడుతోంది శ్వేతా.

నడవాలి. ఓ పదిరూపాయలు పడేసి రిక్షాలో వెళ్ళిరా ఫచ్చుగా.. ఎందుకమ్మా ఎండలో ఇంత శ్రమపడతావు'' అంటారు వుండబట్టలేక పిల్లలు. ''రిక్షానా! ఏమంత దూరమని! నాకు నడక అలవాటే. మీరు సంపాదనా పరులు. పదిరూపాయలేగా అని తేలిగ్గా అనేస్తారు. మాటలట్రా పది రూపాయలంటే. మన శరీరాన్ని మనం మోసుకోలేకపోతే ఎట్లా. మనిషి లాగే రిక్షా ఎక్కటం నాకిష్టం వుండదు. నామస్మరణ చేసుకుంటూ నడిస్తే అలసట, దూరం తెలియదు. మీనాన్న కూడా ఎంత దూరమైనా సరే నడిచే వెళ్ళేవారు'' అంటూ చరిత్ర చెప్తుంది. 'చెప్పటం అనవసరం. ఈవిడ మారదు' అని విసుక్కుంటారు వాళ్ళు.

ప్రతి కథకు సందర్భోచితమైన ఏదో ఒక ముగింపు వుంటుంది. జీవితకథకు అనివార్యమైన ముగింపు మరణమే. మరణం తటస్థించనంతవరకు మనిషి భౌతిక కథ కొనసాగుతున్నట్లే. అకస్మాత్తుగా మామ్మగారి కథకు దైవం అర్థంతరమనిపించే ముగింపునిచ్చింది. ఇష్టదైవాన్ని ధ్యానిస్తూ, ధ్యానిస్తూనే ఒరిగిపోయింది మహేశ్వరమ్మగారు. ఆవిడ ప్రాణప్రియంగా సేకరించుకుని పదిలపరుచుకున్న ధన, కనక, వస్తు సముదాయమంతా వెనకే దిగబడిపోయింది.

''ఇంత వుండి అమ్మ ఏమీ అనుభవించలేదు. ఎంత పేదగా బతికింది''

''మనం చూస్తామో చూడమోనని భయపడింది. అవసరానికి వుంటుందని దాచుకుంది ఖర్చుపెట్టుకోకుండా''


''మనకసలా అవకాశం ఇస్తే కదా. పట్టుమని పదిరోజులు వచ్చి వుండేది కాదు''

''ఈ ఇల్లంటే అమ్మకి ప్రాణం. విడిచి ఎక్కడికీ వెళ్ళలేకపోయేది''

పిల్లలు తల్లిని తలుచుకుని బాధపడ్డారు. కొంచెం తేరుకున్నాక ''ఇంటి విషయం తరువాత. ఏం చెయ్యాలో ఆలోచిద్దాం. ముందు బ్యాంక్ బ్యాలెన్స్ సెటిల్ చేసుకోవటం మంచిది నలుగురం వున్నప్పుడే'' అనుకున్నారు. ఆవిడ లావాదేవీలు, జమా ఖర్చులు ఏముందో ఏం లేదో వుండగా ఎవరికీ చెప్పలేదు. బీరువాలు, సొరుగులు, పెట్టెలు గాలించి తవ్వకాల్లో ఒక ప్లాస్టిక్ పేపర్‌లో చుట్టి వున్న బ్యాంక్‌కి పాస్‌బుక్, చెక్కుబుక్కు పట్టారు. అయితే అందులో వున్న బ్యాలెన్సు చూస్తే వాళ్ళకి తీవ్రమైన నిరుత్సాహం కలిగింది. ''ఏమిటి అమ్మ ఖాతాలో ఏభై వేలేనా వుంది. ఇంకా చాలా వుండాలే. ఆవిడ తినీ తినక పైసా పైసా కూడబెట్టిందంతా ఏమైంది. ఏం చేసిందా డబ్బంతా. తనకు తెలియకుండా తమ్ముడికిచ్చిందా. చెల్లికిచ్చిందా. అంతే అయి వుంటుంది. లేకపోతే అన్ని లక్షలు ఏమైపోతాయి..''

అన్నల మీద చెల్లెళ్లు, చెల్లెళ్ళ మీద అన్నలు అనుమానంతో మల్లగుల్లాలు పడుతున్నారు. ''తల్లికి కడుపున పుట్టిన పిల్లలందరూ ఒకటేనంటారు. ఆ ప్రేమలో తారతమ్యం, పక్షపాతం వుండదంటారు. మరిదేమిటి. ఇంత తెలిసిన అమ్మ ఆడపిల్లననా నన్న్యాయం చేసి అన్నల కిచ్చేసిందంతా. ఎంతైనా ఈ తల్లి తండ్రులంతే. ఎన్ని కబుర్లు చెప్పినా చివరికి వ్యాల్సి వచ్చేసరికి ఆడపిల్లలకి మొండిచెయ్యి చూపెట్టి మొత్తమంతా కొడుకులకే ఇస్తారు తలకొరివి పెడతారని'' అని కూతుళ్ళిద్దరూ లోలోపల అక్కసు పడుతున్నారు.

''చేసేది మేము.. కాలాడకపోయినా చెయ్యాడకపోయినా మంచంమీద సేవలు మాత్రం చెయ్యాలి. దినవారాలే కాక నెల నెలా మాసికాలు ఆ తరువాత మేం బతికున్నంత కాలం తద్దినాలూ పెట్టి వీళ్ళని నరకం నుంచి తప్పించాలి. విషయం వచ్చేసరికి ఆడపిల్లలంటేనే పడిఛస్తారు. ఇద్దరికీ పంచేసి వుంటుంది ముందే..'' కొడుకులు ఉక్రోషపడుతున్నారు.




''అయితే ఈవిడగారు చెక్‌బుక్ కూడా మెయింటైన్ చేసిందన్నమాట బ్యాంక్‌లో. ఇంతవరకూ నాకు లేదు చెక్‌బుక్ ఫెసిలిటీ'' పెద్దబ్బాయి ఎదురుగా లేని తల్లిమీద వ్యంగ్యబాణం విసిరాడు. ''కౌంటర్ ఫాయిల్స్ కూడా దాచివుంచింది. డబ్బు దాచకపోయినా చూడండి. ఈ నోట్‌బుక్‌నిండా మనం పుట్టిందగ్గర్నించి మనమీద పెట్టిన ఖర్చులన్నీ రాసి దాచుకుంది. ఊరికే ఆరాగా చూస్తున్నవాడు ఒకచోట ఆగిపోయాడు. తెలుగులో కౌంటర్ ఫాయిల్స్ మీద ఎంత డబ్బు డ్రా చేసింది, ఎవరికిచ్చింది రాసుకుందావిడ. చూస్తుంటే అతని తల తిరిగి పోయింది. ప్రతి సంవత్సరం డిసెంబరు 28 తండ్రి తిథి నాడు ఆవిడ అప్పటివరకూ దాచి వుంచుకున్నది కొంత అనాథశరణాలయానికి, కొంత రామకృష్ణ సేవాసమితికి, కొంత ఏదో సహాయ నిధికి, కొంత గుళ్ళు, గోపురాలకి పంచి పంపుతున్న రసీదులు. సంవత్సరానికి ఆవిడ ఒక చెక్‌బుక్ మాత్రం వాడేది. అయిపోయాక అట్టమీద ఆ సంవత్సరం ఆదాయమింత, ఖర్చు ఇంత.. 'ఇంత మాత్రమే ధర్మకార్యాలకి ఇవ్వగలిగాను' అని రాసుకుంది. అందులోనే వాళ్ళందరికీ ఒక చిన్న నోట్ కూడా వుంచింది. 'ఇది మీ నాన్నగారు దేశంకోసం త్యాగం చేసి పొందిన గౌరవ వేతనం. ఆయన తరఫున నేను అందుకుంటున్నాను. డబ్బు ఎవరికైనా చేదు కాదు. ఇంకా ఇంకా అవసరం లేకపోయినా సంపాదించి దాచుకోవాలనే వుంటుంది. అయితే మనది త్యాగధనుల వారసత్వం. మీ నాన్నగారు, వాళ్ళనాన్నగారు ఆ పై వాళ్ళు నాటి తరాలన్నీ దేశం కోసం సర్వస్వం త్యాగం చేసారు. నేను నా అవసరాలకి వాడుకుని మిగిలింది మీ నాన్నగారిపేరు మీద ఈ సంస్థలకు పంపుతున్నాను. మీరెవరూ కోటీశ్వరులు కారు. మీకు డబ్బు చాలా ఎక్కువగా అవసరం కావచ్చు. నాకు తెలుసు మీకిచ్చింది తగు మాత్రపు చదువు. భగవంతుడి దయవల్ల మీరంతా మన దేశంలోని చాలామంది కంటే సుఖంగానే బతుకుతున్నారు. మిమ్మల్నెవరి గురించీ నేను దిగులు పడవలసిన పనిలేదు. అందుకే మీ నాన్న గారు ఎంతో త్యాగం చేయటం వలన నేను అనుభవిస్తున్న ప్రతిఫలంలో కొంతైనా తృప్తిగా ఈవిధంగా ఖర్చుపెట్టగలుగుతున్నాను. మీరంతా అనేకసార్లు బాధపడ్డారు, ఆ డబ్బు హాయిగా నేను అనుభవించటం లేదని. కానీ ఈ శరీరాన్ని ఎంత పోషించినా చివరికింతే! మీరు నన్నర్థం చేసుకుంటారనే అనుకుంటున్నాను. ఇందువల్ల నేను అపారమైన తృప్తిని, మానసికానందాన్ని అనుభవించాను. అనుభవమంటే కేవలం దైహికమైంది మాత్రమే కాదు అది ఎవరికి వారే తెలుసుకోవలసిన ఆత్మానందం. ఈరోజుల్లో మనం సాటి మనిషి కోసం, సమాజం కోసం మరి చెయ్యగలిగిన త్యాగమిదే. మిగిలింది అపర కర్మలకి ఉపయోగించండి. పిల్లలకైనా సరే నేను ఋణపడదల్చుకోలేదు''

కనిపెంచిన తల్లి మనసును కూడా అర్థం చేసుకోలేని తమ అజ్ఞానానికి తమని తాము నిందించుకున్నారు. తల్లిని తలచుకుని భక్తితో నమస్కరించుకున్నారు. ఆ ఉత్తమ సంస్కారం తమలో కూడా వుండే వుంటుంది. యాంత్రిక జీవన విధానంలో ఎవరికి వారే వ్యష్టి లాభం కోసం తాపత్రయపడుతూ తమ కోసమే తాము బ్రతుకు తున్నారు. జీవించి వున్నప్పుడు కంటే కనుమరుగయ్యాకే కొందరి ఆదర్శాన్ని తరువాతి వాళ్ళు గ్రహించగలుగుతారు. అనుసరించాలని ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్నంలోని వారిని తమ హృదయంలో నిరంతరం నిలుపుకోగలుగుతారు. ఇప్పుడు మహేశ్వరమ్మ పిల్లలూ అదేస్థితిలో వున్నారు.

★